కథ

# నాకెందుకు?

చిట్టిపెద్ది ఉమ

**ఆశ్వయుజమాసం. రాత్రి పదకొండు గంటలవేళ చిరుచలిగా ఉంది. స్కూటర్‌మీద వస్తుంటే... ఇంత రాత్రివేళ బయటికి వస్తే స్వెట్టర్ చేతిలో ఉంచుకోవాలి అనుకున్నాను. చల్లగాలివల్ల చిన్న వణుకు. ఒ.ఎన్.జి.సి. చౌరాస్తా దాటి తపతి నదిపైన బ్రిడ్జిమీదకి వచ్చాను.**

నేను ఈమధ్యనే ఆంధ్రా నుంచి ట్రాన్స్‌ఫరై సూరత్‌లో కేంద్రీయ విద్యాలయం టీచర్‌గా వచ్చాను. ట్రాన్స్‌ఫర్.. అదీ 'ప్లేగు సిటీ'కా. చాలామంది నా కొలీగ్స్ సానుభూతి చూపించారు. నాకూ కొంత అలాగే అనిపించినా తప్పదు కదా..కానీ సూరత్ అంత భయపడిపోవాల్సినట్టు ఏం లేదు. నిజానికి మనవైపు ఉన్న ఎన్నో సిటీల కంటే చాలా, చాలా బావుంది. అయితే కొంచెం కాస్ట్లీ సిటీ.

సూరత్ తపతి నదికి రెండువైపులా విస్తరించి ఉంది. రెండువైపుల ఉన్న ఊరుని కలుపుతూ తపతి నదిమీద నాలుగు బ్రిడ్జిలు. వెడల్పు రోడ్లు, ఆధునికంగా ఉండే షాపింగ్ మాల్స్, డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌లు, మల్టీ ప్లెక్స్‌లు...సూరత్‌ని ఈమధ్య 'ఖూబ్ సూరత్' అంటున్నారంటే రైటే మరి.

బ్రిడ్జిమీద సంచారం లేదు. పదిరోజుల క్రితంవరకు సూరత్ ఊరంతా ఒకటే హడావిడి. ఆ మాటకొస్తే ఒక్క 'సూరత్' మాత్రమే కాదు మొత్తం గుజరాత్ దేవీనవరాత్రులలో కళకళలాడిపోతుంది. రాత్రి ఒంటిగంట దాటినా ఊరు సద్దుమణగదు. గుజరాత్‌లో దసరా పండగకి ఓ ప్రత్యేకత ఉంది. రాత్రి అవుతూనే ఛనియా చోళీలతో మెరిసిపోతూ కన్నెపిల్లలు, వయస్సుతో నిమిత్తం లేకుండా ఆడవాళ్ళు, ట్రెడిషనల్ డ్రెస్సులో మగ పిల్లలు అందరూ గుజరాత్ రాష్ట్రానికి చెందిన ప్రత్యేకమైన డాన్స్ చేస్తారు. ఈ డాన్స్ చేసేవాళ్ళ హుషారు ఎలా ఉంటుందంటే రాత్రంతా చేయడానికి కూడా వాళ్ళు సిద్ధమే. కానీ ఈమధ్య అర్ధరాత్రి తర్వాత లౌడ్‌స్పీకర్లు ఆఫ్ చెయ్యాలి. ఆ తర్వాత డాన్స్ చెయ్యకూడదు అన్న రూల్ రావడంతో కాస్త తొందరగా ముగుస్తోంది. లేకపోతే తెల్లవారుఝామున మూడుగంటల వరకూ 'రాస్ డాండియా' జరిగేదిట. 'రాస్ డాండియా' అంటే కోలాటం..ఈ డాన్స్‌లు అన్ని వీధుల్లోనూ, పెద్దపెద్ద పార్టీ ప్లాట్‌లలోనూ కన్నుల పండుగగా జరుగుతాయి. కొన్నిచోట్ల ప్రేక్షకులు టిక్కెట్ కొనుక్కోవాలి. మరికొన్ని చోట్ల 'డాన్స్'లో పాల్గొనేవాళ్ళూ రుసుము చెల్లించి మరీ డాన్స్ చేయాలి. వందలమంది రంగురంగుల బట్టల్లో మెరిసిపోతూ చేసే ఈ ప్రోగ్రాములు సోఫిస్టికేటెడ్‌గా, వెల్ ఆర్గనైజ్‌డ్‌గా ఉంటాయి. అన్ని వయస్సులవాళ్ళూ..ఆడా, మగా అందరూ కలిసి చేసే డాన్స్ గుజరాత్‌కే సొంతం.

ఒ.ఎన్.జీ.సీ దాటాను. రెండువైపులా ఆయిల్ టాంకర్లు, ట్రక్కులు..రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. నవరాత్రుల్లో అలిసిపోయిన ఊరు రెస్ట్ తీసుకుంటోందా అన్నట్టు రోడ్డు మీద ఒక్క వెహికల్ లేదు. ఇంకొంచెం ముందుకు వెళ్ళాక రోడ్డు వారగా పడి ఉన్న ఓ స్కూటర్ కనిపించింది. పక్కనే ఓ మనిషి. గుండె ఝల్లుమంది. యాక్సిడెంట్...ఇటూ-అటూ చూశాను. కనుచూపుమేరలో ఏ వాహనమూ లేదు. మనుష్యులూ లేరు.. 'ఏం చెయ్యాలిప్పుడు?' బతికి ఉన్నాడా లేకపోతే? ఎలా జరిగిందో యాక్సిడెంట్..ఎవరికైనా ఇన్‌ఫార్మ్ చేయాలి. చేస్తే నన్నే అనుమానించరు కదా..కొత్త ఊరు...భాష రాదు..పోలీసుల చక్కర్‌లో ఇరుక్కుంటామేమో? స్కూటర్ మెల్లిగా ఆపాను. అసలు ఆ మనిషి బతికి ఉన్నాడో? లేదో? కాస్త దూరం నుంచే పడి ఉన్న మనిషి వైపు చూశాను. సన్నటి వెలుతురులో అతను ఓ ఇరవై ఏళ్ళ కుర్రాడు అని స్పష్టంగా తెలుస్తోంది. అయ్యో ఎంత చిన్నపిల్లవాడు. ఎక్కడినుంచి వస్తున్నాడో? ఆ కుర్రాడు పడి ఉన్న తీరు చూస్తే బతికి ఉన్నాడో లేదో తెలియటం లేదు. ముట్టుకుని చూస్తే..ఒక్కక్షణం ముందుకి సాగిన చెయ్యి వెనక్కి వచ్చేసింది.

నేను చూసిన డిటెక్టివ్ సినిమాలు, సీరియల్స్, చదివిన డిటెక్టివ్ కథలూ కళ్ళముందు తిరిగాయి ఒక్కక్షణంలో....ఇంకానయం ముట్టుకున్నాను కాదు..అమ్మో ఫింగర్ ప్రింట్స్...ఈ ఏకాంత ప్రదేశంలో అసలు నన్నిప్పుడు అక్కడ చూస్తే నేనే యాక్సిడెంట్‌కి కారణం అనుకుంటారు. స్కూటర్ దిగి అటువైపు వచ్చినందుకు నన్ను నేనే తిట్టుకున్నాను.


నా దారిన నేను పోతేసరి. అనవసరంగా ఇరుక్కోవడం ఎందుకు..స్కూటర్ ఎక్కి ఎవరో తరుముతున్నట్టు అక్కడినుంచి బయటపడ్డాను. గుండె దడదడలాడుతోంది. ఇటువైపుంచి నేను రావడం..నా స్కూటర్ నెంబర్ ఎవరైనా చూస్తే..దారిలో ఇంకెక్కడా ఆగకుండా స్పీడుగా ఇంటికొచ్చిపడ్డాను. దారిలో ఓ క్షణం 'టోల్‌గేట్' దగ్గర ఎవరికైనా చెప్పుదామా అనుకున్నాను. కానీ మళ్ళీ 'నాకెందుకు?' అనిపించింది. ముందుగా నేనే చూశాను అంటే ఎన్నో ప్రశ్నలు. పోలీసుల చుట్టూ తిరగాలి. ఒకవేళ నన్నే అనుమానిస్తే..ఒకపక్క భయం. ఇంకోపక్క అనుమానం 'అపాయంలో ఉన్న వాళ్ళకి సహాయం అందించాలి. పెద్ద వాళ్ళు రోడ్డు క్రాస్ చేస్తూంటే వాళ్ళని జాగ్రత్తగా రోడ్డు దాటించాలి' లాంటి నీతులు చెప్పే టీచర్‌నై ఉండి ఇలా గప్‌చిప్‌గా ఉండిపోవడం..అసలు ఆ అబ్బాయి బతికి ఉన్నాడా? లేదా? యాక్సిడెంటయి ఎంతసేపు అయిందో...షర్ట్‌మీద కొద్దిగా రక్తం తప్ప ఎక్కువ దెబ్బలు కన్పించలేదు మరి బతికే ఉన్నాడేమో.

ఇంటికి వచ్చి పడుకున్నా రాత్రంతా తప్పు చేశానన్న ఫీలింగ్..అంతలోనే ఇలాంటి వాటిల్లో ఇరుక్కోకపోవడమే మంచిది అని నా మనస్సుకి నేనే సర్దిచెప్పుకోవడం. ఏదో తెలియని అలజడి మనస్సుని కలచివేస్తూంటే రాత్రంతా నిద్రే పట్టలేదు.

* * *

తెల్లారి లేచేటప్పటికే ఏడు దాటింది. స్కూల్‌కి వెళ్ళే సమయం అయిందని గబగబా స్నానం, టిఫిన్ కానిచ్చి స్కూల్‌కి బయలుదేరాను. పేపర్ చూడ్డానికి కూడా టైము లేదు. ఏ తెల్లారుఝామునో నిద్ర పట్టిందేమో. నిద్రలేమికి తలంతా పగిలిపోతోంది. రాత్రి సంఘటన మళ్ళీ కళ్ళలో కదలాడుతూ అలజడి మొదలైంది. ఇంట్లో భారతితోనో, కొలీగ్స్ ఎవరితోనైనా చెప్పుకుంటే కాస్త మనశ్శాంతి ఉంటుందేమో..కానీ ఎవరికీ చెప్పాలని అనిపించలేదు. చెప్తే ఎవరెలా రియాక్ట్ అవుతారో..పనిలో నిమగ్నం అయి కాస్సేపు ఆ సంగతి మర్చిపోయాను.

ఇంటర్వెల్‌లో స్టాఫ్‌రూంలో ఉన్న పేపర్ తీసి చూశాను ఏమైనా తెలుస్తుందా అని. మొదటి పేజీలోనే ఉంది ఆ న్యూస్. ఆ కుర్రాడి వయసు ఇరవై మూడేళ్ళుట. పేరు కల్పేష్..ఫ్రెండింటికి వెళ్ళి వెనక్కి ఇంటికి వెళ్తున్నాడుట. బహుశా హెవీ వెహికల్ ఏదో డాష్ ఇచ్చి ఉండచ్చు సైడ్ నుంచి అని వివరాలు సమంగా తెలియలేదు అని రాసి ఉంది. ఆ అబ్బాయి పేరు కల్పేష్..బ్రెయిన్ హెమరేజ్ వల్ల పదకొండు పది..ఆ ప్రాంతంలో చనిపోయి ఉండవచ్చునని రిపోర్టులో వచ్చిందిట. నా నవనాడులూ కుంగిపోయాయి. యాక్సిడెంట్ ఎప్పుడయినా..ఇంచుమించు ఆ సమయంలో నేను. ఆ అబ్బాయిని చూశాను. అప్పటికీ బతికే ఉన్నాడా? ఏమో...నేను త్వరగా ఎవరికైనా ఇన్‌ఫార్మ్ చేసి ఉంటే ఎలా ఉండేదో? రాత్రి పడ్డ భయం, గాభరా బదులు ఇప్పుడు గిల్టీనెస్ చోటు చేసుకుంది నాలో. కొలీగ్స్ ఎవరితో చెప్పలేకపోయాను కానీ భారతితో చెప్పకుండా ఉండలేకపోయాను. "బాధపడకండి...ఎవరి



తల రాతని ఎవరూ మార్చలేరు. ఓ పదినిమిషాలు ముందు ఆస్పత్రిలో చేర్చినా ఆ అబ్బాయి బతికి ఉండే వాడు కాదేమో..అయినా మీరూ ఎవరికైనా చెప్పి అతన్ని హాస్పిటల్‌కి తీసికెళ్ళేటప్పటికి పావుగంటైనా పట్టి ఉండేది..ఏదెలా జరగాలో అలాగే జరుగుతుంది. దాని గురించి మర్చిపొండి'' భారతి ఓదార్పుతో నేను తప్పు చేయలేదన్న భావం కలిగింది. ఆ సమయంలో నేను కాక ఎవరున్నా అలాగే ప్రవర్తించేవాళ్ళేమో...ఆ టైములో రోడ్డు మీద ఇంకెవరైనా ఉండి ఉంటే..బహుశా నా ప్రవర్తన వేరే రకంగా ఉండేది. అందరం కలిసి ఏదో ఒకటి చేసేవాళ్ళం. ఆరోజు 'పార్లే పాయింట్‌'లో ట్యూషన్ చెప్పి ఎప్పుడూ లేనిది నేను మరీ లేట్‌గా ఆ రోడ్డు మీదకి రావడం, యాక్సిడెంట్, రోడ్డు నిర్మానుష్యంగా ఉండడం. భారతి అన్నట్టు జరగాల్సిందేదో జరిగింది అని ఎంత నన్ను నేను సముదాయించుకున్నా చాలారోజులు ఆ సంఘటన ముల్లులా గుండెని గుచ్చుతూనే వచ్చింది.

★ ★ ★

"భారతీ.. వినయ్ ఎక్కడికి వెళ్ళాడు..ఇంకా రాలేదేమిటి?'' రాత్రి పడుకోబోతూ అడిగాను. టైము పదకొండున్నర..వినయ్ ప్రవర్తన నాకేం నచ్చటం లేదు. డిగ్రీలో చేరాడన్న మాటే కానీ చదువుకంటే ఫ్రెండ్స్, తిరుగుళ్ళు ఎక్కువ. చదువుమీద శ్రద్ధే ఉంటే ఏ ఇంజనీరింగ్‌లోనో సీటు వచ్చేది. కానీ ప్రతీదాన్ని చాలా తేలిగ్గా తీసుకునే తత్వం...నిర్లక్ష్యం...బాధ్యత ఎప్పుడు తెలుస్తుందో.

"వాడు సిటీలో పార్టీ అని వెళ్ళాడు. చిన్న పిల్లల పార్టీ కదా..లేటవుతుంది. మీరు పడుకోండి.''

స్కూటర్ మీద రాత్రిపూట అంతేసి దూరాలు వెళ్ళద్దని చెప్తే వినడు. అసలే రోడ్లమీద ట్రక్కులు, టాంకర్లు..మనస్సంతా ఆందోళనతో నిండిపోయింది. కల్పేష్ గుర్తుకొచ్చి నిద్రకరువయింది. పక్కమీద అశాంతిగా దొర్లుతున్నాను.

"ఏమండీ..వినయ్..హాస్పిటల్..'' భారతి కేకలతో మెలకువ వచ్చింది.

"భారతీ ఏమైంది...ఎందుకలా అరుస్తున్నావు..వినయ్ వచ్చాడా?''

"ఏమండీ..వినయ్..'' భారతి వణికిపోతూ వెక్కివెక్కి ఏడుస్తోంది. మా అమ్మాయి అప్పటికే పక్క ఇళ్ళ వాళ్ళని

పిల్చుకొచ్చింది.

"విష్ణుకాంత్‌గారూ..భయం లేదు. వినయ్ సేఫ్‌గానే ఉన్నాడు. చిన్నదెబ్బలేట. కాస్సేపట్లో వినయ్‌కి స్పృహ వస్తూనే మనం అందరం వెళ్ళి చూడచ్చు" పక్కింటాయనా, ఎదురింటాయనా ధైర్యం చెప్తున్నా భారతి కన్నీరు-మున్నీరుగా విలపిస్తూనే ఉంది. 'పార్లే పాయింట్'లో ఉన్న ఓ నర్సింగ్ హోమ్ పదిహేను నిమిషాల్లో చేరుకున్నాం.

"ఈయనే..మీ అబ్బాయిని చూసి వెంటనే హాస్పిటల్‌కి తీసుకువచ్చారు" నర్స్ ఒకర్ని చూపించి అంది. ఆయన అటువైపునుంచి కార్లో వస్తున్నాడు. వినయ్ రోడ్డు మీద పడి ఉండడం చూసి తీసుకు వచ్చారుట. ఆయన పేరు నితిన్ మెహతా. నేను ఆయన చేతులు పట్టుకుని ఎలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియక..నోట్లోంచి మాట కూడా రాక మవునంగా కన్నీరు కార్చాను.

"వర్రీ కాకండి. మీ అబ్బాయికి మరీ పెద్దదెబ్బలు తగలలేదు అన్నారు.." ఆయన. నాకూ, భారతికీ ధైర్యం చెప్పారు. రెండు రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచి పూర్తిగా నార్మల్ అని సర్టిఫికెట్ ఇచ్చాక వినయ్‌ని ఇంటికి తీసుకు వచ్చాము. చెయ్యికి, కాలుకి పెద్ద గాయలు అయ్యాయి. అయితే విరగలేదు. నితిన్ మెహతా వినయ్ హాస్పిటల్లో ఉన్న రెండు రోజులూ వచ్చి చూసి క్షేమం కనుక్కుని వెళ్ళాడు. ఇంటికి వచ్చేముందు ఓ నర్స్ ద్వారా తెలిసింది. నితిన్ మెహతా కొడుకు అదే రోడ్డు మీద నాలుగు నెలల క్రితం ఓ యాక్సిడెంట్లో మరణించాడని. ఆ అబ్బాయి పేరు కల్పేష్ మెహతా. నాకు ప్రపంచం తిరిగిపోతున్నట్టుగా అనిపించింది. కళ్ళు చీకట్లు కమ్మాయి. ఎంతో కష్టంమీద నన్ను నేను కంట్రోల్ చేసుకోగలిగాను. అపకారికి ఉపకారము. గుండెల్లో గుబులు. ఆరోజు నేనూ వెంటనే నితిన్ మెహతాలా స్పందించి ఉంటే కల్పేష్ బతికి ఉండేవాడా...గిల్టీనెస్ నన్ను దహించడం మొదలుపెట్టింది. నాలాగే ఆయన కూడా 'నాకెందుకు?' అనుకుని ఉంటే వినయ్...ఏమయ్యేవాడు.

వినయ్ కాలి మీద చేతిమీద ఉన్న గాయాలు మానడానికి పూర్తిగా నెల పట్టింది. వినయ్ గాయాలు తగ్గగానే ముందుగా వాడికి పునర్జన్మ ప్రసాదించిన నితిన్‌మెహతా ఇంటికే మొదట వెళ్ళాలనుకున్నాను. ఆ తర్వాత ఏ గుడి అయినా..ఏ మొక్కులయినా.

* * *

"హలో..హౌ ఆర్ యు యంగ్ మేన్.." నితిన్ మెహతా మమ్మల్ని సాదరంగా ఆహ్వానించాడు. వినయ్ వంగి ఆయన పాదాలకి దణ్ణం పెట్టాడు. వాడి కళ్ళనుంచి రాలి పడిన అశ్రువులు ఆయన పాదాలని తడిపాయి. నా కళ్ళల్లోనూ కన్నీరు.

"అరే..ఎందుకంత ఎమోషనల్‌గా ఫీలవుతున్నారు. ఎదిగివచ్చిన కొడుకుని పోగొట్టుకోవడం అన్న బాధ నాకు తెలుసు. మా అబ్బాయి ఈమధ్యనే..." నితిన్ మెహతా కంఠం పూడుకుపోయింది దుఃఖంతో. "ఇందులో నేను చేసిందేం లేదు..ఆ సమయంలో ఎవరున్నా అలాగే చేస్తారు..అది మానవతా ధర్మం.."

"మానవతాధర్మం అయినా అందరూ మీలా ప్రవర్తించరు. నాలాంటి వాళ్ళూ ఉంటారు. నన్ను క్షమించండి" నన్ను నేను కంట్రోల్ చేసుకోలేకపోయాను. నితిన్ మెహతా చేతులు పట్టుకుని విలపిస్తూంటే ఆయన ఆశ్చర్యంగా చూశాడు నా వైపు.

"ఆరోజు..నాలుగు నెలలక్రితం..కల్పేష్ యాక్సిడెంట్ అయిన కొంత సమయానికి నేను అక్కడ ఉన్నాను. రోడ్డుమీద వేరెవ్వరూ లేరు. కొత్తప్రదేశం...భాష రాదు..'నాకెందుకు' అని ముందుకు సాగిపోయాను." నేను వివరంగా చెప్తూంటే నితిన్ మెహతా వెర్రిగా చూశాడు.

ఆయన నా రెండు చెంపలూ లాగి కొట్టినా భరించడానికి సిద్ధంగా ఉన్నాను నేను. చాలాసేపు స్తబ్దుగా ఉండిపోయాడు నితిన్ మెహతా. నేను, వినయ్ తలలు దించుకుని జడ్జిమెంట్‌కోసం ఎదురుచూస్తున్న అపరాధుల్లా కూర్చున్నాం.

"విష్ణుకాంత్‌జీ..మీ దోషం ఏం లేదు. మిమ్మల్ని మీరు సంబాళించుకోండి. ఫేట్ అన్నది ఒకటి ఉంది చూశారూ..అది బలీయమైనది. మీరు చూసేటప్పటికి కల్పేష్ కొన ఊపిరితో ఉన్నాడో? లేకపోతే అప్పటికే లేడో..మీరు ఏదైనా చేసినా ఫలితం ఎలా ఉండేదో..ఫర్‌గెట్ ఇట్" తేరుకున్న నితిన్‌మెహతా మమ్మల్ని ఓదారుస్తుంటే ఆయన ఔన్నత్యానికి అచ్చెరువుగా ఉంది. నితిన్ మెహతా భార్యనీ, పిల్లలనీ పరిచయం చేశాడు. కల్పేష్ ఆఖరివాడుట. ఒక కూతురు..కొడుకు ఉన్నారు. ఇంట్లో..అన్నదమ్ములతో కలిసి బట్టల వ్యాపారం ఉమ్మడిగా చేస్తారుట. అన్నదమ్ముల ఇళ్ళు పక్క పక్కనే ఉన్నాయి. ఆయన చాలా మామూలుగా మాట్లాడుతూ..మా బిడియం పోగొట్టాడు. కొంతసేపయ్యాక సెలవు తీసుకుని ఇంటికి బయలుదేరాము.

చాలా రోజులుగా నా గుండెల్లో పేరుకున్న అపరాధ భావం కొంత తగ్గి మనస్సు తేలికయింది. వేమన పద్యం గుర్తుకు వచ్చింది. 'పురుషులందు పుణ్యపురుషులు వేరయా...విశ్వదాభి రామ వినురవేమ' ఎంత నిజం..నితిన్‌మెహతాలాంటి వాళ్ళు పుణ్యపురుషుల జాబితాలోకే వస్తారు. విధి బలీయం అని ఎన్ని విధాల సరిపెట్టుకున్నా అపరాధభావం నన్ను ఈ జన్మలో వదలదు. ఏమూలో ఉండుండి కలుక్కుమంటూనే ఉంటుంది. ఈ సంఘటన నాలోనే కాదు వినయ్‌లోనూ మార్పు తెచ్చింది.

అల్లరిచిల్లరిగా ఈజీగోయింగ్‌గా ఉండే వినయ్ చదువుమీద శ్రద్ధ చూపించడంతోపాటు, స్వచ్ఛంద సేవా సంస్థల్లోనూ యాక్టివ్‌గా పనిచేస్తున్నాడు. సమాజం పట్ల తన బాధ్యత తెల్సుకుని ప్రవర్తిస్తున్నాడు. ఇదో పెద్ద మలుపు... వాడి జీవితంలో..నా జీవితంలో కూడా. ఉదాసీనత నుంచి 'నాకెందుకు?' అన్న బాధ్యతారహిత ప్రవర్తన నుంచి బాధ్యతవైపు తిప్పిన మలుపు.

## అభి హావా

'సర్కార్' చిత్రంలో అద్భుతమైన నటనకి అందరి ప్రశంసలు అందుకున్న అభిషేక్‌బచ్చన్ ఇప్పుడు వరుస అవకాశాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. స్టార్ ప్రొడ్యూసర్స్, దర్శకులు ఇతనితో కలిసి సినిమాలు తీయడానికి ముందుకు వస్తున్నట్టు ఇండస్ట్రీ వర్గాల కథనం. అయితే మంచి కథ, తన పాత్రకున్న ప్రాధాన్యతని దృష్టిలో పెట్టుకుని ఎంపిక చేసుకుంటానని చెబుతున్నాడు బిగ్‌బి తనయుడు. అలాంటి ఎంపిక అభిషేక్‌కి హాట్రిక్ విజయాల్ని తెచ్చిపెడుతుందేమో చూడాలి మరి!

